రివరీ:

# నాలో మేము

*

అహి

ఒకరు చెప్పే పేరు నాకు నచ్చదు. అదేనని నమ్మకమూ లేదు. నే నడగనూ లేదు, ఆమె చెప్పనూ లేదు. అసలు పేర్లంటేనే నా కసహ్యం. నేను పుట్టినప్పుడు ఏ పేరూ తగిలించుకొని రాలేదందుచేతనే.

అంచేత 'ఆమె' అని చెప్పుకోనే కంటె వేరు మార్గం లేదు.

నేను కనురెప్పలు తెరిచి, ఏనాడు, ఏ క్షణం చూపు సంపాదించేనో అప్పుడే ఆమె పుట్టింది. నా చూపు పెరుగుతున్నట్టే పెరుగుతున్నది. ఆమె నాకు ప్రియమైనది. ఎంతగా, ఎలా, ఎప్పట్నించి, ఎప్పుడెప్పుడు ప్రియమైనదో నాకు తెలియనంత, నేను తెలుసుకోలేనంత ప్రియమైనది. ఆమెకు నేను ప్రియమైనవాణ్ణి ఔనో కాదో? కాని ప్రియమైన వాణ్ణనే అనుకుంటున్నాను. "నీవు నాకు ప్రియమైన వాడివి కావు" అని ఆమే చెప్పినా, నేను నమ్మక, నేను ప్రియమైన వాడినే అనుకున్నంత దృఢంగా నమ్ముతున్నాను. లేకపోతే నే నిల్లా యింకా ఉండి ఉండను.

నాకు అడ్డుగా ఆమె తప్ప మా యిద్దరి మధ్య మరేమీ లేదు. అసలామెలోనే నేనున్నానేమో ?......

ఆమె నీలాల కొప్పులోని మల్లెపూల పరిమళం నాలో దూరి నన్నాడిస్తోంది. ఆమె కట్టిన ఏడు వన్నెల చీర వెలుగుపడి అన్నీ అవుపిస్తున్నాయి. నా కన్నులలో అన్నీ మారగలుతున్నాయి. ఆమె ఆకు పచ్చని రవికలోంచి వచ్చే వేడిమి నా రక్తానికి చలన మిచ్చింది.

ఆమె దగ్గరనుండి ఎన్నో, ఎన్నో తీసుకున్నాను. ఆమే యిచ్చివేస్తూంది. కాని నే నేమీ యివ్వలేను, నన్నే యిచ్చుకోవడం తప్ప, అసలు నేనూ ఆమె సొత్తే కాబోలు.

నేను నవ్వుతే ఆమె నవ్వుతుంది. నేను ఏడిస్తే ఆమె ఏడుస్తోంది. ఆమె ఒక అద్దం.

పరుగెత్తే రైలు పెట్టెలో కూర్చొని కిటికీల్లో చూస్తూ ఉంటే ఆమె కనిపిస్తుంది. ఆమె కనుపించినపుడల్లా రైలక్కడే ఆగిపోలవానో, ఆమెకూడా రైలుతో నా ఎదుటనే ఉంటూ పరుగెత్తిరావాలనో ఉంటుంది.

అలాగే ఆమె నా వెనువెంట పరుగెత్తుకొని వస్తూంది. ఆమెకు తెలుసు, నేను అశక్తుణ్ణని, ఆగలేనని.

నాచూపు నిలిచే చోట ఆమెపోయి నిలుస్తుంది. ఆకాశంవేపుచూస్తే తెల్లని నల్లని మబ్బుల్లో, వెలుగు కిరణాల్లో, చంద్రబింబంలోని పొన్నచెట్టు నీడలో తారకల నడుమలో నిలిచి కనుపిస్తుంది.

కలలో ఆమె కనుపించినపుడల్లా ఆ కల కలకాలమూ నిలిచి ఉండాలనిపిస్తుందిగాని రెప్పలు విడిపోక తప్పవు. కనురెప్పలు తెరిచినా, కళ్ళెదుటనే ఉంటుంది. ఆమెకు తెలుసు. అశక్తుణ్ణని... కల నిలుపుకోలేనని, ప్రతి నిమిషమూ చూస్తూన్నా, చూస్తూనే ఇంకా చూడాలనే ఉంటుంది. ఎంత దగ్గరగా ఉన్నా, ఇంకా దగ్గరలో ఉండాలని ఉంటుంది.

కాని ఆమె ప్రయత్నానికి అందదు. ఆమె ఎంత విశాలమైనది అంటే ఆమెతో ఆమెకే కొలత.

మెదడులోని, హృదయంలోని కళ్ళచూపులే మా భావాలు.

మా అమ్మ అన్నం పెడుతోన్నప్పుడు, ప్రమిదలోని జ్యోతి మా అమ్మ కనుపాపలో ప్రతిబింబిత మౌతున్నప్పుడు ఆ ప్రతిబింబంలో ఆమె అతి మధుర భంగిమంలో 'తిను'మని హెచ్చరిస్తూ—

ఆమె కనుపించింది — కనుపించింది !

ఆమెలో కరిగి కలిగిపోవాలన్న నా కోర్కెలోనే ఆమె దాగి నన్నాక్రమించు కొంటోంది.

అందుకోసమే కరిగి కలిసేవరకూ నేనుంటానని ఉండాలని అని ఆమే అంటోంది.

ఆకర్షణీయమైన రచనలకు ఆనందవాణి